# తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు?

సాధారణంగా ప్రయాణం వెళ్లేటప్పుడు సామాన్లు సర్దుకోవడం సహజం. కాని ఈ భూమిపై జన్మించిన మనిషి నాలుగైదు పదులు దాటిన తదుపరి తన తిరుగు ప్రయాణం నిమిత్తం సమాయత్తం అవ్వాలి. అది అతనికి మంచిది. జీవితపు ప్రయాణంలో అలసిపోయిన వారు కొందరు, ఓటుమిలతో కొందరు విజయ దర్పంతో మరికొందరు. దుఃఖభారం, అవమాన భారం, ఆర్థిక భారం, సంసార భారం, అనారోగ్యభారం ఇత్యాది అనేక విషయాలతో పోరాడి అసిపోయిన మనసుకు ప్రశాంతత కావలసి ఉంటుంది. తనవారి కోసం తపన తగ్గించుకోవాలి. తపనకి ఆరాటానికి అంతూ పొంతూ ఉండదు. ఏదో ఒక ప్రయోజనం లేనిదే చిన్న చీమను కూడా భగవంతుడు ఈ భూమి పై సృష్టించడు. ప్రతి ఒక్క జీవికి ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. ఇవన్నీ నాలుగైదు పదులుదాటే సరికి ఎలాగూ పూర్తయిపోతాయి. సంసారం, భోగభాగ్యాలు అనేవీ అతని కూడా తిరుగు ప్రయాణంలో ఉండవు. తిరుగు ప్రయాణంలో కూడా ఉండేవి అతగాడు ఈ జన్మలో సంపాదించుకున్న పాప-పుణ్యాలు. వీటి ఫలితాలను అతని మరణానంతరం అతని వారసులు ఎలానూ అనుభవిస్తారు. అతగాడు కూడా ఆ పాప-పుణ్యాల ఆధారంగా మరు జన్మ పొందవల్సి ఉంటుంది.

ఏదీ-ఎవరూ తనకు శాశ్వతం కాదనేది మనిషికి చివరి ఘడియలలో తెలియడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. పుణ్యం సంపాదించడానికి ధన సిరులే అవసరం లేదు. 'మాటసాయం' చేసినా చాలా పుణ్యం. యితరులకు అపకారం ఆశించకపోవడమూ పుణ్యమే. పాపం చేయడమంటే భగవంతుడు ఎదుటివానికి చేస్తున్న మంచిని అడ్డుకోవడమే. తద్వారా దైవ ఆగ్రహానికి గురిఅవుతారు. అదే పాపం అతినిని శిక్షిస్తుంది.

తను చెయ్యాల్సిన పనులు ధర్మబద్ధంగా పూర్తిచేసి, తన బాధ్యతలు నిర్వర్తించి, ఆ సర్వేశ్వరుడ్ని ఆరాధించుకొంటే ఆయనే తన వద్దకు పిలిపించుకొంటాడు. కనుక ఆ చివరి ప్రయాణానికి సన్నద్ధం, సమాయత్తం అవ్వడం మంచిది. ఆ సర్వేశ్వరుడి పిలుపుకోసం ఎదురుచూడడమే తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు.